సాక్షి
వనపర్తి
మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



కలగానే భీమా ప్రాజెక్టు

భీమానదిపై ప్రాజెక్టు నిర్మాణం కలగానే మిగిలిందని రైతులు అంటున్నారు.

వివరాలు 8లో



పకడ్బందీగా భూ సర్వే

'పేట-కొడంగల్' భూ సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఐజీ సత్యనారాయణ కోరారు.

వివరాలు 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.3 /17.8

మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది. చలి తీవ్రత తగ్గుముఖం పట్టింది. అప్పుడప్పుడు వేడి గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

చట్టానికి అందరూ సమానమే



వనపర్తి రూరల్: కుల, మత, ధన, బీదలాంటి వివక్ష లేకుండా చట్టం అందరికీ సమాన న్యాయం అందిస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి వి.రజని అన్నారు. సోమవారం మండలంలోని చిట్యాల చేయూత ఆశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు చదువుకునే హక్కు, నివసించే హక్కు, బాల్యవివాహాల చట్టం గురించి వివరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ.. అలవాటు పడిన పిల్లలు ఎలా బయటపడాలో సూచించారు. కార్యక్రమంలో ఉత్తరయ్య, ఆశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు: ఎమ్మెల్యే



అమరచింత: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 39 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. తమ ప్రభుత్వ పాలనలో ప్రతి మూడు నెలలకు ఓసారి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందిస్తున్నామని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులకు పంట రుణమాఫీతో పాటు రైతుభరోసా నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. అనంతరం పట్టణంలోని రాజావలి దర్గా ఉర్సు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. తహసీల్దార్ రవియాదవ్, పుర కమిషనర్ రవి బాబు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, రాష్ట్ర నాయకుడు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, అయ్యూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పోసిరిగారి విష్ణు పాల్గొన్నారు.

37 మందికి హెచ్‌సీలుగా పదోన్నతి

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పని చేస్తున్న 37 మంది కానిస్టేబుల్స్‌కు హెడ్‌కానిస్టేబుల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ సోమవారం జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 22 మందికి, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఐదుగురికి, వనపర్తిలో ఆరుగురికి, గద్వాలలో ముగ్గురికి, నారాయణపేట జిల్లాలో ఒకరికి హెడ్‌కానిస్టేబుల్స్‌గా పదోన్నతి కల్పించారు. వీరిలో మహబూబ్‌నగర్‌లో ఒకరికి, నాగర్‌కర్నూల్ జిల్లాలో 13 మందికి, వనపర్తిలో ఆరుగురికి, గద్వాలలో ఆరుగురు, నారాయణపేట జిల్లాలో 9 మందికి, ఇంటలిజెన్స్‌లో ఇద్దరికి పోస్టింగ్ ఇచ్చారు. పదోన్నతి వచ్చిన హెడ్‌కానిస్టేబుల్స్ రెండు రోజుల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది.

మన్యంకొండ జాతరకు ప్రత్యేక బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని 12, 13 తేదీల్లో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్, నారాయణపేట డిపోల నుంచి 20 బస్సులను నడుపుతామని పేర్కొన్నారు. కొండ మీదకు ప్రత్యేకంగా 20 మినీ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఉపాధి.. ఊసేది?

పురపాలికల్లో కూలీలకు కరువైన ఎన్ఆర్ఈజీఎస్ పనులు

- 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'కూ దూరం!
- భారమవుతున్న జీవనం
- ప్రజాప్రతినిధులు స్పందించాలని వేడుకోలు



ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు గోపాల్ వయస్సు 55 సంవత్సరాలు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అమరచింత మున్సిపాలిటీగా మారకముందు భార్యాభర్తలిద్దరు ఏడాదిలో వందరోజులకుపైగానే ఉపాధి పనులకు వెళ్లి వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషించుకునేవారు. పురపాలికగా మారాక ఉపాధి పనులు దూరమై జీవనం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం తమకు సైతం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలని కోరుతున్నారు.



అమరచింత చెరువులో పూడిక తొలగిస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

అమరచింత: గ్రామాల్లోని వ్యవసాయ కూలీలతో పాటు పేదలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2006, ఫిబ్రవరి 2న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామాల్లోనే కూలీలకు ఏడాదికి 100 రోజుల పనిదినాలు కల్పిస్తూ పనికి తగిన కూలి చెల్లించేది. కాలానుగుణంగా అవసరానికి తగ్గట్టుగా ఏడాదికి 150 రోజుల వరకు పనిదినాలు కల్పించి ఆదుకుంది. దీంతో గ్రామీణ వ్యవసాయ కూలీలకు వేసవిలో పనులు దొరికి కుటుంబ జీవనం సాగేది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టణాలు, పురపాలికల్లో ఉపాధి పనులు తొలగించడంతో ఆయా ప్రాంతాల్లోని కూలీలు 'ఉపాధి'కి దూరమయ్యారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన పురపాలికల్లోనూ ఉపాధి పనులు కరువై ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఉపాధి కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12 వేలు చెల్లించేందుకు సిద్ధమవడంతో పట్టణ ప్రాంత కూలీలు సైతం తమకు పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో కొత్తగా ఏర్పడిన పురపాలికల్లో 13,242 మందికి జాబ్ కార్డులుండగా.. వారంతా ఉపాధి పనులు కోల్పోయారు. తమకు ఉపాధి పనులు కల్పించాలంటూ కూలీలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తున్నారు.

కూలీ పనులు లేక ఇబ్బందులు..



అటు వ్యవసాయ కూలీ పనులు లేక.. ఇటు వంద రోజుల పనులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వయో భారంతో వరి నాట్లకు వెళ్లలేకపోతున్నాం. ఉపాధి లేక బతుకు భారమైంది.

– వెంకటమ్మ, అమరచింత

ఉపాధి కోల్పోయాం..



మున్సిపాలిటీగా మారితే మా బతుకులు మారుతాయని అనుకున్నాం.. కానీ ఉపాధి కూలీ పనులు తీసేస్తారని అనుకోలేదు. ఆరేళ్లుగా బీడీ కార్మికుడిగా పనిచేస్తూ బతుకున్నాం. పట్టణాల్లో సైతం ఉపాధి పనులు కల్పించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలి.

– ఎస్.నర్సింహులు, అమరచింత

ప్రభుత్వం చొరవచూపాలి..



గతంలో కాలనీలోని మహిళమంతా వంద రోజుల పనికి వెళ్లి వచ్చే కూలితో కుటుంబాన్ని పోషించుకునే వాళ్లం. ఇప్పుడు పనులు లేక బతుకు భారంగా వెళ్లదీస్తున్నాం. ప్రభుత్వం ఉపాధి పనులు కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12 వేలు చెల్లించాలి.

– కె.సుజాత, అమరచింత

జిల్లాలో ఇలా..

జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త పురపాలికలు, మండలాలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాలోని పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూర్, అమరచింతను పురపాలికలుగా మారుస్తూ 2018, ఆగస్టులో ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆయా మున్సిపాలిటీల్లోని 13,242 మంది కూలీలు ఉపాధి కోల్పోయారు. ఇందులో వనపర్తి పుర పరిధి రాజనగరంలో 479, నాగవరంలో 643, శ్రీనివాసాపురంలో 1,020, నర్సింగాపురంలో 70 మంది.. పెబ్బేరులో 2,245, చెలిమిళ్ల విలీనం కావడంతో 872 మంది ఉపాధి పనులకు దూరమయ్యారు. అలాగే కొత్తకోట పురపాలికలో 1,915 మంది, ఆత్మకూర్ మున్సిపాలిటీలో 1,975 విలీన గ్రామమైన ఖానాపురంలో 568 మంది.. అమరచింత మున్సిపాలిటీలో 4,093 మంది కూలీలు ఉపాధి కోల్పోయారు. అప్పటి నుంచి ఉపాధి పనులు కల్పించాలంటూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యథావిధిగా కొనసాగించాలి..

పట్టణ ప్రాంతాల్లో పనులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురపాలికల్లో ఎత్తేసిన ఉపాధిహామీ పనులను యథావిధిగా కొనసాగించాలని ఆందోళనలు చేస్తున్నాం. గతంలో ఉపాధి పనులు చేసిన వారిని గుర్తించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేసి ఆదుకోవాలి.

– అజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు, వ్యవసాయ కార్మిక సంఘం

పట్టణ ప్రాంతాలకు వర్తించదు..

2023–2024 సంవత్సరంలో ఏర్పడిన పురపాలికల్లోని కూలీలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తిస్తుందని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. అంతకుముందు ఏర్పడిన పురపాలికలకు ఇది వర్తించదు. ఈ విషయమై అధికారులతో పట్టణ కూలీలకు అవగాహన కల్పించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పట్టణ ప్రాంతాల్లో గతంలో ఉపాధి పనులు చేసిన వారిని గుర్తించే వీలుంది.

– సుల్తాన్, ఏపీడీ, వనపర్తి

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి.. చిత్రంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు

- కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: స్థానిక సంస్థల ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడంలో రిటర్నింగ్ అధికారులదే కీలక పాత్రని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 12న రిటర్నింగ్ అధికారుల శిక్షణలో నామపత్రాలు స్వీకరించే రోజు నుంచి స్క్రూటినీ, విత్‌డ్రా, గుర్తులు కేటాయింపు వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధ్యతలు, ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికి ఎన్నికల నిబంధనలు క్షుణ్ణంగా అర్థమయ్యేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఇవ్వాలన్నారు. నామినేషన్ గదిలోకి అభ్యర్థి, ప్రతిపాదకుడు, మరో వ్యక్తిని మాత్రమే అనుమతించాలని సూచించారు. నామినేషన్ సరిగా సమర్పించేలా అవగాహన కల్పించాలని.. నామపత్రంలో ఏమైనా తప్పులు, లోపాలుంటే పరిశీలించి నోటీస్ ఇవ్వాలన్నారు. జెడ్పీటీసీ స్థానానికి పోటీచేసే అభ్యర్థి రూ.5 వేలు, ఎంపీటీసీ స్థానానికి పోటీచేసే అభ్యర్థి రూ.2,500 చెల్లించాల్సి ఉంటుందని.. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వివరించారు. సర్పంచి, వార్డు సభ్యుడిగా పోటీచేసే అభ్యర్థుల పేర్లు సంబంధిత గ్రామపంచాయతీ ఓటరు జాబితాలో తప్పక ఉండాలని, అదే జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు తప్పనిసరి కాదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, జి.వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డీపీఓ సురేశ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజావాణి ఫిర్యాదులు, అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణికి ఆయన హాజరై రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీఓ సుబ్రమణ్యంతో కలిసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణికి మొత్తం 46 దరఖాస్తులు వచ్చాయని.. సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులకు సిఫారస్ చేసినట్లు వివరించారు. సీఎం ప్రజావాణి, కలెక్టరేట్ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైతుల పక్షాన.. బీఆర్ఎస్ పోరాటం



కోస్గి 'రైతు నిరసన దీక్ష'లో మాట్లాడుతున్న కేటీఆర్.. చిత్రంలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, మహమూద్ అలీ, నిరంజన్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్, మాజీ ఎమ్మెల్యేలు నరేందర్‌రెడ్డి తదితరులు

పచ్చని పొలాలను అదానీ, అల్లుడికి దానం చేస్తే ఊరుకోం

- లగచర్ల రైతుల పోరాట స్ఫూర్తి ఢిల్లీని కదిలించింది
- రాష్ట్రంలో దుర్యోధన పాలన సాగుతోంది
- కోస్గి 'రైతు నిరసన దీక్ష'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కోస్గి: 'రాష్ట్రంలోని రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుంది. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులను కళ్లలో పెట్టుకొని చూసినం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ 14 నెలల కాలంలో రైతుబంధుకు రాం రాం.. పూర్తిస్థాయి రుణమాఫీ జరగలేదు. కానీ, మిత్రుడు అదానీ, అల్లుడు, ఎనుముల కుటుంబ కోసం రైతుల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నాడు.' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. సోమవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కోస్గిలో చేపట్టిన 'రైతు నిరసన దీక్ష' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై రైతులనుద్దేశించి ప్రసంగించారు.

పచ్చని పంటలు కనిపిస్తున్నాయి

రాష్ట్రంలో దుర్యోధనుడి పాలన కొనసాగుతుంది. కొడంగల్ ప్రజల ఓట్లతో గెలిచిన రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతంలోని భూముల్లో తొండలు గుడ్లు పెడుతాయి తప్ప వ్యవసాయానికి పనికి రాదని చెప్పి.. ఇప్పుడు అవే భూములను లాక్కునే ప్రయత్నం చేశాడని, ఇక్కడికి వచ్చి చూస్తే తుంకిమెట్ల నుంచి రోడ్డుకు ఇరువైపులా పచ్చని వరిపంటలు కనిపిస్తున్నాయని చెప్పారు. 60, 70 ఏళ్ల నుంచి సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న గిరిజన రైతుల భూములను లాక్కునే ప్రయత్నం చేస్తే లగచర్ల, రోటిబండతండా రైతుల పోరాట స్ఫూర్తి ఆదర్శప్రాయమన్నారు. తండాల్లో 70 మంది మీద మొదట కేసులు పెట్టారు.. తర్వాత కాంగ్రెస్, బీజేపీ నాయకులు, మద్దతుదారుల పేర్లు తొలగించి 40 మంది బీఆర్ఎస్ మద్దతుదారులను మాత్రమే జైల్లో పెట్టారు. వీరితోపాటు అండగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని 40 రోజుల పాటు జైల్లో ఉంచారని గుర్తుచేశారు. జైల్లో ఉన్న నరేందర్‌రెడ్డిని మేం కలవడానికి వెళ్తే.. నేను బాగానే ఉన్నాను. రైతుల కోసం నెల కాదు ఏడాదైనా జైల్లో ఉంటాను. అక్రమంగా కేసులు బనాయించి చర్లపల్లి జైల్లో పెట్టిన రైతులను విడిపించాలని మాజీ ఎమ్మెల్యే సూచించారని గుర్తుచేశారు. మా మాజీ ఎమ్మెల్యే రైతుల పక్షాన జైలుకు వెళితే.. సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ.. ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లారని దుయ్యబట్టారు.



కోస్గిలోని రామాలయం చౌరస్తా నుంచి ర్యాలీగా వస్తున్న కేటీఆర్

కొద్దికాలంలోనే తీవ్ర వ్యతిరేకత

రాష్ట్రంలో కొద్దికాలంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల్లో 420 హామీలిచ్చి ఏ ఒక్కటీ కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కర్రుకాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. నారాయణపేట నియోజకవర్గంలోని దామరగిద్ద తండాలో కూడా వంద గిరిజన కుటుంబాలకు చెందిన భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని.. మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కేటీఆర్ దృష్టికి తీసుకురాగా వీరికి అండగా కూడా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని భరోసా ఇచ్చారు. రోటిబండతండా రైతులతో సభలో కేటీఆర్ మాట్లాడించారు.

ఎత్తిపోత పథకం కాంట్రాక్టు మంత్రి కోసమే..

కొడంగల్– పేట ఎత్తిపోతల పథకం కాంట్రాక్టు కాంగ్రెస్‌లోని ఓ మంత్రి కోసం రూ.4,500 కోట్లు పెట్టాడని కేటీఆర్ దుయ్యబట్టారు. అంతకుముందే పాలమూరు ఎత్తిపోతల ద్వారా కొడంగల్ ఒక్క నియోజకవర్గానికే 1.50 లక్షల ఎకరాలకు సాగునీటి అందించడానికి 90 శాతం పనులు పూర్తయ్యాయని, ఇప్పుడు ఆ పనులు ఆపి జూరాల నుంచి మళ్లీ నీళ్లు తీసుకొస్తానని కొత్త నాటకం ఆడుతున్నారని పేర్కొన్నారు.

మళ్లీ మోసపోకండి

మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు పరచలేదన్నారు. 14 నెలల కాలంలో అన్నివర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. మరోసారి వారిని నమ్మి మోసపోవద్దని చెప్పారు. లగచర్ల బాధితులకు అండగా ఉన్న విషయాన్ని గిరిజన భాషలోనే మాట్లాడి దీక్షలో రైతులను ఆకట్టుకున్నారు.

■ మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు, శ్రామికుల చెమటకు విలువ తెచ్చిన నాయకుడు, భూమికి విలువ పెంచిన నాయకుడు, పంట తెచ్చిన నాయకుడు, పంట కొన్న నాయకుడు ఒక్క కేసీఆరే అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేరళకు వెళ్లి దక్షిణాది రాష్ట్రాలు చాలా అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. ఈ అభివృద్ధిలో నీ భాగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పాలన కూడా లేదని, ప్రాంతీయ పార్టీల పాలనలోనే అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన ఉంటే దాన్ని నీ పాలనలో దిగువకు చేర్చుతున్నావని దుయ్యబట్టారు.

■ రైతు నిరసన దీక్ష సభాధ్యక్షుడు, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల పక్షాన నిరంతరం పోటారం చేస్తూనే ఉంటానని గుర్తుచేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తన దృష్టికి వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ఆనంద్, అంజయ్యగౌడ్, మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీవేంకటేశ్వరుల కల్యాణం




కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి (అంజనగిరి) శ్రీలక్ష్మీ అలవేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కనులపండువగా సాగింది. రెండ్రోజులుగా ఆలయంలో స్వామివారికి క్షీరాభిషేకం, ధ్వజారోహణం, గరుడసేవ తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం కల్పవృక్ష వాహనసేవ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు 10 గంటలకు స్వామివారి కల్యాణ క్రతువు ప్రారంభించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను బంగారు ఆభరణాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, శారద దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణ వేడుక తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు దాతలు ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి..

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని సూరాయిపల్లి, ఉప్పరిపల్లి, సోళీపురం, రుక్కన్నపల్లి, ఆగారం, కమాలోద్దీన్‌పూర్, వెంకటాంపల్లి, ఖిల్లాఘనపురంలో సీసీ, బీటీ రోడ్లు, డ్రెయినేజీలు, క్రీడా ప్రాంగణం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ఉప్పరిపల్లి నుంచి మంగంపల్లి వరకు రూ.2.53 కోట్లతో చేపట్టే బీటీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నాయకులు రవీందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, శ్యామ రాజు, సాయిచరణ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, బాలకృష్ణారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మండలపార్టీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, ఆగారం ప్రకాష్, శ్యాంసుందర్‌రెడ్డి, రాములునాయక్, రవి నాయక్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సత్వర పరిష్కారానికి చర్యలు : ఎస్పీ



వనపర్తి: ప్రజావాణి వినతులు సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ రావుల గిరిధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ఫిర్యాదుదారులతో వినతులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏడు వినతులు రాగా.. తక్షణమే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సంబంధిత ఠాణాల అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల విచారణలో జాప్యం జరగకుండా త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల్లో మార్పులుంటే చెప్పాలి

వనపర్తి: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ప్రతిపాదనలు చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలు పరిశీలించి ఏమైనా మార్పు చేర్పులుంటే తెలియజేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోపాల్‌పేట మండలం జింకలబీడు, కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామపంచాయతీల్లో ముసాయిదా పోలింగ్ కేంద్రాల వివరాలు ఇచ్చామని.. ఇబ్బందులుంటే ఫిబ్రవరి 13న జరిగే సమావేశంలో చెప్పాలని సూచించారు. ఈ సందర్భంగా ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను వారికి అందజేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాను ఫిబ్రవరి 13న ప్రకటిస్తామని.. వాటిని పరిశీలించి అదేరోజు జరిగే సమావేశంలో చెప్పాలన్నారు. శ్రీరంగాపురం మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ ప్రతినిధి రాజేందర్ మాట్లాడుతూ.. శ్రీరంగాపురం గ్రామపంచాయతీలో ఒకేచోట పోలింగ్ కేంద్రాలు ఉండటంతో ఓటర్లకు దూర భారం అవుతుందని.. విభజిస్తే బాగుంటుందని తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, డీపీఓ సురేశ్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ నుంచి రాజేంద్రప్రసాద్, ఎంఐఎం నుంచి రహీం, టీడీపీ నుంచి కొత్తగొల్ల శంకర్, బీఆర్ఎస్ నుంచి సయ్యద్ జమీల్, భాజపా నుంచి కుమారస్వామి పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


విఘ్నేశ్వర్ రెడ్డి (ఫైల్)

కొత్తకోట: ధ్వజస్తంభ వేడుకల కోసం అత్తారింటికి వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణానికి చెందిన ఎల్లంపల్లి సాయిరెడ్డికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. అందులో చిన్న కుమార్తె పావనిని దేవరకద్ర మండలం గుడిబండ గ్రామానికి చెందిన తుమ్మల విఘ్నేశ్వర్ రెడ్డి(45)తో 12 ఏళ్ల క్రితం వివాహం జరిపించాడు. మూడు రోజులుగా కొత్తకోటలో శ్రీ అంబాభవాని ఆలయంలో కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలు జరుగుతుండడంతో కూతురు, అల్లుడిని వేడుకల కోసం పిలిపించాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం పట్టణంలో విఘ్నేశ్వర్‌రెడ్డి బైక్‌పై వెళుతుండగా కొత్తకోట నుంచి వనపర్తికి వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సు ఎదురుగా వచ్చి వేగంగా ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. మృతుడి మామ సాయిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ శివారులో ఉన్న ఓపల్‌చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. వివరాలు.. సుమారు 35–40 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం చెరువులో కనిపించింది. స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని నీటిలో నుంచి బయటికి తీసి జిల్లా కేంద్రంలో మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై లోదుస్తులు మినహా ఇతర దుస్తులు లేవని, ఆచూకీ తెలిసిన వారు అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్రవాహనం కొనివ్వలేదని..

- ఓ తండ్రి ఆత్మహత్యాయత్నం

కోడేరు: ద్విచక్ర వాహనం కొనివ్వలేదని ఓ తండ్రి పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన కోడేరు మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కోడేరుకు చెందిన గొల్ల వెంకటశేషయ్య ద్విచక్ర వాహనం కొనివ్వాలని ఇటీవల తన కుమారుడిని అడిగారు. అయితే ఆయన ససేమిరా అనడంతో ఎవరూ లేని సమయంలో వేరుశనగ పంట కోసం తెచ్చిన పురుగుమందు తాగాడు. చుట్టు పక్కల వారు గమనించి కోడేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు.

హత్యా.. ఆత్మహత్యా?

బిజినేపల్లి: మండల కేంద్రంలోని పాత ఎంపీడీఓ కార్యాలయ భవనం వద్ద ఆదివారం రాత్రి కాలిపోయి ఉన్న వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించిన విషయం విదితమే. అయితే ఎవరైనా హత్యచేసి ఇక్కడ దహనం చేశారా? లేక అతడు ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడా అనే విషయంపై మిస్టరీ వీడలేదు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాల మేరకు సోమవారం అతడి బంధువులు మృతదేహాన్ని గుర్తించారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎదిరలో నివాసముంటున్న ఎం.యాదగిరి (49)గా తెలిసింది. అతడిది తిమ్మాజిపేట మండలంలోని అమ్మపల్లి గ్రామం. యాదగిరికి ఇద్దరు భార్యలు ఉండగా.. అందులో మొదటి భార్యది మహబూబ్‌నగర్ కాగా, రెండవ భార్యది బిజినేపల్లి. ఆదివారం మృతుడు యాదగిరి బిజినేపల్లిలోని ప్రధాన రహదారులపై తిరిగినట్లుగా సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అతడి మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, మృతదేహం ఆచూకీ తెలిసిన తర్వాత విచారణలో వేగం పెంచినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. సమగ్ర విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

సరిహద్దులో పశుసంవర్ధక శాఖ తనిఖీలు


పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పశుసంవర్ధకశాఖ ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్

అలంపూర్: బాయిలర్ కోళ్లకు అవిన్ ఇన్ఫ్లూన్జా అనే వైరస్ వ్యాపిస్తుందని.. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లోని కోళ్లలో ఈ వైరస్‌ను గుర్తించినట్లు పశుసంవర్ధకశాఖ అధికారి శిరీష తెలిపారు. ఇందుకోసం అలంపూర్ చౌరస్తా సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద సోమవారం చెక్‌పోస్టును ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి వచ్చే కోళ్ల వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. ఈమెతో పాటు ఉండవెల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు నిరంతరం తనిఖీలు చేస్తున్నారు. వైరస్ వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కోళ్ల వాహనాన్నింటిని వెనక్కి పంపుతున్నట్లు శిరీష తెలిపారు.

కలగానే భీమా ప్రాజెక్టు


కూసుమర్తి-సూకూర్ లింగంపల్లి గ్రామాల వద్ద ఉన్న భీమా నది

- ప్రభుత్వ ప్రతిపాదనలకే పరిమితం
- నిర్మాణం చేపట్టాలని కోరుతున్న నదితీర ప్రాంత రైతులు

కృష్ణా: రాష్ట్రంలో కర్ణాటక సరిహద్దు గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ ప్రాంత ప్రజల ప్రధాన ఆర్థిక వనరు వ్యవసాయం, వ్యవసాయం బాగుండాలంటే సాగునీరు అందాలి. కానీ సాగునీటికి నిరంతరం రైతులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతమని చెప్పవచ్చు. ప్రభుత్వాలు చొరవచూపి కృష్ణా, భీమా, తుంగభద్ర నదులపై అవకాశం ఉన్నచోట మినీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టవచ్చు. కొంతకాలంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయమై ఆలోచిస్తున్నా ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నదులపై బ్యారేజీల నిర్మాణానికి కృషి చేయాలని, ప్రధానంగా భీమా నదిపై ప్రాజెక్టు నిర్మించాలని నదితీర ప్రాంత ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

1987లోనే తీర్మానం..

1987–88 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం భీమా ప్రాజెక్టు నిర్మించి ఉమ్మడి పాలమూరు జిల్లాకు సాగు, తాగునీరు అందించాలని నిర్ణయించి తర్వాత ఎలాంటి ప్రయత్నాలు చేయకుండా నిర్లక్ష్యం చేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా నదితీరాల్లో ఎత్తిపోతల పథకాల నిర్మాణాలు చేపట్టింది. పెండింగ్ భీమా ప్రాజెక్టు నిర్మించాలంటూ అప్పట్లో బీజేపీ రాష్ట్ర నాయకులు కృష్ణా మండల కేంద్రం నుంచి ఎద్దులబండ్ల ర్యాలీ చేపట్టారు.. కాని ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం అదే భీమానదిపై చిన్నపాటి బ్యారేజీ నిర్మించాలని కొంతకాలంగా ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మిగులు జలాల వినియోగానికి..

రాష్ట్ర ప్రభుత్వం మిగులు జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే ఏకైక మార్గం భీమానదిపై బ్యారేజీ నిర్మాణమే.. ఇందుకుగాను గతంలో సాగునీటిశాఖ అధికారులు ఓ ప్రణాళిక రూపొందించారు. కాని ఆ ప్రతిపాదనలు కేవలం ఏరియల్ సర్వే వరకే నిలిచిపోయాయి. సాగునీటిశాఖ అధికారులు మరోమారు ప్రత్యేక చొరవ చూపాలని నదితీర ప్రాంత రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టు నిర్మించాలి..



భీమానదిపై ప్రాజెక్టు నిర్మాణానికి 30 ఏళ్లుగా ఈ ప్రాంత రైతులు ఎదురుచూస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో ఈ ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వాలు మారుతున్నాయి.. నాయకులు మారుతున్నారుగానీ సాగునీటి ఇబ్బందులు తొలగడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా మా బాధలు అర్థం చేసుకొని ప్రాజెక్టు నిర్మించాలి.

– ప్రతాప్, రైతు, కూసుమర్తి

నీటి ఇబ్బందులు ఉండవు..



ఎగువన ఉన్న కృష్ణా, భీమా నదులపై ఆనకట్టలు, చెక్‌డ్యాంలు నిర్మిస్తే ఎత్తిపోతల పథకాలు, నదితీర ప్రాంత రైతులకు నీటి ఇబ్బందులు తొలుగుతాయి. ఆయా నదులపై కర్ణాటకలో ఎక్కడికక్కడ బ్రిడ్జి కం బ్యారేజీలు నిర్మించడంతో అక్కడి రైతులు ఏడాదికి రెండు పంటలు సాగు చేస్తున్నారు. వేసవిలో నదిలో నీరు లేకపోయినా బ్యారేజీ నీటిని వాడుకుంటారు. ఇక్కడ కూడా ఇబ్బందులు తొలగాలంటే మనం కూడా ఆనకట్టలు నిర్మించాలి. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు విన్నవించాం.

– సోమశేఖర్‌గౌడ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

పకడ్బందీగా 'పేట- కొడంగల్' భూ సర్వే


ఐజీ సత్యనారాయణకు పూల మొక్క అందజేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, పక్కన డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట టౌన్: 'పేట- కొడంగల్' ఎత్తిపోతల పథకానికి సంబంధించిన మొదటి దశ భూ సర్వేని శాంతిభద్రతల మధ్య పకడ్బందీగా పూర్తిచేయాలని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పంచాయతీరాజ్ అతిథి గృహానికి వచ్చిన ఐజీకి కలెక్టర్ సిక్తా పట్నాయక్, జోగుళాంబ జోన్-7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ యోగేష్ గౌతమ్ పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. అనంతరం ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో పేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ సర్వే గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం కోసం ల్యాండ్ యాక్ట్ 2013 ప్రకారం భూ సర్వే చేపట్టడం జరుగుతుందని, ల్యాండ్ సర్వే చేసే సమయంలో ఎవరైనా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించారు. భూ సర్వే సమయంలో అసలు భూమి లేని వారు ఆటంకం కలిగించినట్లు తమకు సమాచారం ఉందన్నారు. మొదటి దశ భూ సర్వే జరిగే సమయంలో ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే నోటిఫికేషన్ 60 రోజుల్లోగా తెలపాలని కోరారు. కానీ, భూ సర్వేను ఉదేశపూర్వకంగా ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాలమూరు కలెక్టరేట్ గార్డెన్‌కు 'గోల్డ్' సర్టిఫికెట్


కలెక్టరేట్ జవాన్‌ను శాలువాతో సన్మానిస్తున్న కలెక్టర్ విజయేందిర

జిడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఆవరణలో ఉన్న గార్డెన్‌కు గోల్డ్ గార్డెన్ సర్టిఫికెట్ వచ్చింది. రాష్ట్ర ఉద్యానశాఖ, పట్టు పరిశ్రమశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది గార్డెన్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 2024 సంవత్సరానికిగాను హైదరాబాద్‌లో నిర్వహించిన 8వ గార్డెన్ ఫెస్టివల్‌లో మహబూబ్‌నగర్ కలెక్టరేట్ గార్డెన్‌కు గోల్డ్ గార్డెన్ సర్టిఫికెట్, రోలింగ్ ట్రోఫీ అవార్డు వరించింది. గార్డెన్‌ను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్న అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోహన్ రావు, డీఆర్ఓ కేవీవీ రవికుమార్, కలెక్టరేట్ ఏఓ శంకర్, కలెక్టరేట్ జవాన్ నరేందర్, గార్డెన్ నిర్వహణ సిబ్బందిని కలెక్టర్ విజయేందిర అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జవాన్‌ను శాలువాతో సత్కరించారు.

దొంగతనం చేశారనే నెపంతో..
మైనర్లపై పోలీసుల దాష్టీకం


పోలీసుల లాఠీ దెబ్బలతో గాయపడిన బాలుడు

మల్దకల్: దొంగతనం చేశారనే నెపంతో ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలలపై పోలీసులు ప్రతాపం చూపించారు. పోలీస్‌స్టేషన్‌లో ఇష్టానుసారంగా లాఠీలతో చితకబాదడంతో ఓ బాలుడికి తీవ్రగాయాలై ఆస్పత్రిపాలయ్యాడు. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండలంలోని మేకలసోంపల్లి గ్రామంలో గతనెల మూడు ఇళ్లలో చోరీలు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. ఓ యువకుడితో పాటు ఐదుగురు మైనర్ బాలలను విచారణ పేరుతో స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ తమ ఇష్టానుసారంగా కొట్టి వదిలేశారు. అందులో ఓ బాలుడికి తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి దొంగతనం చేయని తమ కుమారుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ పేరుతో చితకబాదారని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. స్థానిక పోలీసుల తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. కాగా, ఈ విషయమై ఎస్‌ఐ నందికర్‌ను వివరణ కోరగా.. దొంగతనం కేసులో కొందరిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించాం తప్ప లాఠీలతో కొట్టలేదని చెప్పారు.

రూ.3.47 లక్షలు మోసం చేసిన సైబర్ నేరగాళ్లు

మహబూబ్‌నగర్ క్రైం: టెలిగ్రామ్ యాప్‌లో పెట్టుబడి పెడితే అధికంగా లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్ నేరగాళ్లు ముగ్గురు వ్యక్తుల నుంచి రూ.3.47లక్షల నగదును మాయం చేశారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హబీబ్‌నగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి అబ్దుల్‌ఖదీర్ జిలానీకి ఇటీవల వాట్సాప్ ద్వారా ప్రత్యేక లింక్ పంపడంతో పాటు కాల్ చేసి టెలిగ్రామ్ యాప్‌లో పెట్టుబడి పెడితే లాభం వస్తుందని చెప్పారు. అదినమ్మిన అబ్దుల్ ఖదీర్ రూ.1,51,200 పంపించాడు. ఆతర్వాత ఫోన్‌చేయగా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. మరో కేసులో శివశక్తినగర్‌కు చెందిన సురేష్‌కు కూడా ఇదే తరహాలో ఫోన్ చేసి యాప్‌లో పెట్టుబడి పెట్టాలని సూచించి అతని ఖాతాలో నుంచి రూ.1,65,000 తస్కరించారు. మరోఘటనలో ఎంబీసీ స్కూల్ ఏరియాకు చెందిన నవీన్‌కుమార్ ఖాతాలో నుంచి రూ.31వేలు మాయం చేశారు. ముగ్గురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా తేనెటీగల పెంపకం


తేనెటీగల పెంపకం శిక్షణకు హాజరైన రైతులతో శాస్త్రవేత్తలు, కళాశాల అసోసియేట్ డీన్ పిడిగం సైదయ్య

కొత్తకోట రూరల్: తేనెటీగల పెంపకంపై రైతులు నైపుణ్యం పెంపొందించుకోవడం ద్వారా వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా నిర్వహించుకోవచ్చని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య అన్నారు. ఉద్యాన కళాశాల వేదికగా తేనెటీగల పెంపకంపై ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశంలో లభించే తేనె అత్యంత శ్రేష్ఠమైనదని.. పోషక విలువలతో పాటు ఔషధ గుణాలు ఉండటం వల్ల ఎగుమతికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. తేనెటీగల పెంపకం వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా ఎదిగితే రైతులకు అదనపు ఆదాయం కచ్చితంగా లభిస్తుందన్నారు. వ్యవసాయం, పర్యావరణం, మానవ సమాజానికి ఎక్కువగా ఉపయోగపడే ఏకైక పరిశ్రమగా తేనెటీగల పెంపకం పేరు పొందిందని గుర్తుచేశారు. భవిష్యత్‌లో సాధించే తీపి విప్లవానికి తేనెటీగల పెంపకం ప్రధానంగా ఉంటుందన్నారు. అనేక బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు తేనెటీగల పెంపకానికి ఆర్థిక మద్దతు ఇస్తున్నాయని.. రుణాలు సైతం ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ పెట్టుబడితో సంవత్సరమంతా ఉపాధి పొందవచ్చన్నారు. తేనెకు ఎంత కాలమైన నిల్వ ఉండే సామర్థ్యం ఉంటుందని.. అందువల్ల నష్టాలు ఎట్టి పరిస్థితుల్లో ఉండవన్నారు. అనంతరం ప్రధాన శిక్షకులు అసోసియేట్ ప్రొఫెసర్ డా.షహనాజ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్‌లోని కూరగాయల పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలో తేనెటీగల జాతులు, శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం, తేనె పట్టు నిర్వహణ, తేనె తీసే విధానం, తేనెటీగల పెంపకం ద్వారా లభ్యమయ్యే ఉత్పత్తుల మార్కెటింగ్, మెళకువల గురించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూరగాయల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా. వీరసురేష్, విస్తరణ అధికారి పోతరాజు యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి


కొండేరు కార్డెన్‌సెర్చ్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ మొగులయ్య

- కార్డెన్ సెర్చ్‌లో డీఎస్పీ మొగులయ్య

ఎర్రవల్లి: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. గుట్కా, మట్కా, జూదం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు చేసే వారిని గుర్తించేందుకు కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ మొగులయ్య అన్నారు. సోమవారం మండలంలోని కొండేరులో సీఐ రవిబాబు సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 60 ద్విచక్ర వాహనాలతో పాటు 10 ఆటోలను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామం జాతీయ రహదారికి ఆనుకొని ఉండటం వల్ల దొంగలు అధికంగా సంచరించే ప్రమాదం ఉందని, ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలిన, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే గురించి సమాచారం తెలిస్తే తప్పకుండా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే, ప్రజలు ఎవరు కూడా బ్యాంకు వివరాలు, ఏటీఎం వివరాలు ఇతరులకు తెలపవద్దని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని సూచించారు. అనంతరం సీఐ రవిబాబు మాట్లాడుతూ మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా లేక ఎలాంటి ఆపదలో ఉన్నా వెంటనే 100కు డయల్ చేసి అపాయం నుండి బయటపడాలన్నారు. ప్రజలు ఎల్లప్పుడూ పోలీస్ వారికి సహకరించి వారి నుండి రక్షణ పొందాలని సూచించారు. అనంతరం వాహణ ధ్రువపత్రాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు వెంకటేష్, స్వాతి, వెంకటస్వామి, మహేష్, ఏఎస్సైలు పాల్గొన్నారు.

13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: పట్టణంలో రేషన్ కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన 13 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. వివరాలు.. సోమవారం ఉదయం గద్వాలలోని రేషన్ కార్డుదారుల నుంచి 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తక్కువకు పిల్లిగుండ్ల కాలనీకి చెందిన మారెన్న కొనుగోలు చేశారు. వీటిని బొలెరో గూడ్స్ వాహనంలో రాయచూర్‌కు తరలిస్తున్నట్లు సమాచారం అందగా పట్టణ శివారులో అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుబడిన బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వాహనాన్ని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం


స్టేషన్‌కు వచ్చిన యువకులతో మాట్లాడుతున్న సీఐ నాగార్జున

కల్వకుర్తి టౌన్: మద్యం మత్తులో యువకులు వీరంగం సృష్టించిన ఘటన కల్వకుర్తి పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని హనుమాన్ నగర్, సుభాష్ నగర్ కాలనీలకు చెందిన కొందరు యువకులు ఆదివారం రాత్రి వేర్వేరుగా ఊర్కొండ మండలానికి వెళ్లారు. అక్కడ ఇరు వర్గాల నడుమ గొడవ జరిగింది. స్థానికులు సర్దిచెప్పడంతో వారంతా అక్కడి నుంచి కల్వకుర్తికి తిరిగివచ్చారు. ఈ క్రమంలో తిరిగి వారి మధ్య గొడవ ప్రారంభమైంది. అయితే చుట్టుపక్కల వారు వారించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇదిలా ఉంటే, సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు ఇరు వర్గాలు గుంపులుగా వస్తున్న క్రమంలో ఒకరిని ఒకరు దుర్భాషలాడుతూ కొట్టుకున్నారు. కోర్టు సముదాయం, పలు దుకాణాల వద్ద రాళ్లతో రువ్వుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న నాగరాజు అనే రైతుకు గాయాలయ్యాయి. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఘటన జరగటంతో.. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. సదరు యువకులను కల్వకుర్తి సీఐ నాగార్జున వారించారు. ఘటనపై ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. యువకుల వీరంగానికి మద్యం, గంజాయి మత్తులో ఉండటమే కారణమని వారి తోటి స్నేహితులు చర్చించుకుంటున్నారు.

రబీ పంటల్లో సస్యరక్షణ చర్యలు

- మిరపలో కొమ్మ ఎండు, లద్దె పురుగు
- జొన్నలో కాండం తొలుచు పురుగు నివారణ


సాగులో ఉన్న మిరప పంట

మిరపలో ఎండు తెగులు →

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: రబీలో సాగు చేసిన పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. రైతులు ముందస్తుగా సస్యరక్షణ చర్యలు చేపడితే పంటను కాపాడుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించడానికి అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్ తెలిపారు. ఇటీవలే కురిసిన వర్షాలతో గాలిలో తేమ శాతం ఎక్కువ కావడం వలన మిరప పంటలో కొమ్మ ఎండు తెగులు ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అల్టర్‌నేరియా అనే శిలీంద్రం వలన ఈ కొమ్మ ఎండు తెగులు ఆశిస్తుందని వివరించారు. ఈ తెగులు కారణంగా ముదురు కొమ్మల బెరుడుపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయని సూచించారు. ఆ తర్వాత కొమ్మలు ఎండుతూ కిందికి వస్తాయి. ఈ తెగులు తీవ్రమైనప్పుడు కొమ్మలు ఎండిపోయి కిందికి వాలిపోతాయి. దీని వలన దాదాపు 50 శాతం వరకు పంట నష్టం జరిగే అవకాశం ఉంటుంది.


నివారణ: ఈ తెగులును గుర్తించిన వెంటనే ప్రోపికొనజోల్ 1 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి లేదా లీటర్ నీటిలో డైపెన్‌కొనజోల్ 0.5 మి.లీ.కలిపి లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

లద్దె పురుగు (లేదా) కాయతొలుచు పరుగు .. మిరప పంట చిరుకాయ దశలో ఉంది. అక్కడక్కడా కాయ తొలుచు పురుగు ఆశించడమైనది, ఈ పురుగు కాయలోకి ప్రవేశించి కాయ లోపలి పదార్థాన్ని తినడం వలన కాయ నాణ్యత పడిపోతుంది. కాయపై చిన్న చిన్న రంధ్రాలు చేసి ఈ పురుగు కాయ లోపలికి ప్రవేశిస్తుంది.

నివారణ: వేప నునె 5 మి.లీ. అసిఫేట్ 1.5గ్రాములు, నువలురాన్ 1 మి.లీ ఫ్లుబెండమయిడ్ 0.3 మి.లీ. లేదా క్లోరాంత్రినిపోల్ 0.3 మి.లీ.ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

పోషకాల పిచికారీ: వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఎకరానికి 30 కిలోల యూరియా, 20 కిలోల పోటాష్ ఎరువులు వేసుకోవాలి. పొలంలో తేమ అధికంగా ఉన్నప్పుడు 19:19:19 పోషకము 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

జొన్న పంటలో సస్యరక్షణ అవసరం:


కాండం తొలుచు పురుగు →

జొన్న పంట సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ తెలిపారు. జిల్లాలో సాగు చేసిన జొన్న పంటకు కాండం తొలుచు పురుగు ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. కాండం తొలుచు పురుగు ఆకుల కొనల ద్వారా అంకురం వరకు ప్రవేశించడం వల్ల మొక్క చనిపోవడం జరుగుతుంది. రబీ సీజన్‌లో ఈ పంట ఉధృతి అధికంగా ఉంటుందని రైతులకు సూచించారు. ఈ పురుగు నివారణకు కార్బో సల్ఫాన్ గుళికలను ఎకరానికి 5 కిలోలు మొక్క సుడులలో వేయాలని సూచించారు. పురుగు ఉధృతి మరింత ఎక్కువగా ఉన్న సమయాల్లో క్లోరాంత్రినిపోల్ 0.3 మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.